సాక్షి కర్నూలు

శుక్రవారం : 7 : జూలై : 2023



అడుగంటిన టీబీ డ్యాం

హొళగుంద: తుంగభద్ర జలాశయం డెడ్ స్టోరేజీకి చేరుకుంది. గురువారం నాటికి 3 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో ఏమీ లేకపోగా 193 క్యూసెక్కుల నీరు బయటకెళ్తోంది.



శ్రీమఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు గురువారం భక్తులు భారీగా తరలివచ్చారు. దర్శనానికి దాదాపు 2 గంటల సమయం పట్టింది.



నేడు పదోన్నతుల కౌన్సెలింగ్

కర్నూలు(సిటీ): ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న ఎస్జీటీలకు (తెలుగు, ఉర్దూ, కన్నడ) స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతులు కల్పించేందుకు శుక్రవారం డీఈఓ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

న్యూస్‌రీల్

హౌసింగ్ ఈఈ నాగరాజుకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న నాగరాజు

కర్నూలు(అర్బన్): రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కర్నూలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సి.నాగరాజు రాష్ట్ర స్థాయి అవార్డును అందుకున్నారు. విజయవాడలో ఘనంగా జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్‌జైన్, గృహ నిర్మాణ సంస్థ ఎండీ లక్ష్మిషా పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పురోగతి చూపిన అధికారులకు అవార్డులను ప్రదానం చేశారు. కర్నూలు డివిజన్‌లో 51 శాతం గృహ నిర్మాణాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో నాగరాజుకు ఉన్నతాధికారులు మెమొంటో, ప్రశంసా పత్రాన్ని అందించి సన్మానించారు.

దివ్యాంగులకు జాతీయ పురస్కారాలు

కర్నూలు(అర్బన్): జిల్లాలో వివిధ అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్న విభిన్న ప్రతిభావంతులైన అభ్యర్థులకు(దివ్యాంగులు) 2023 జాతీయ పురస్కారాలను అందిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు రయిసా ఫాతిమా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు www.disabilityaffairs.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. అర్హులైన దివ్యాంగ అభ్యర్థులు ఈ నెల 15 నుంచి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. దివ్యాంగులకు వ్యక్తిగతంగాను, దివ్యాంగుల సాధికారతకు కృషి చేస్తున్న సంస్థలకు కూడా పురస్కారాలు అందిస్తామన్నారు.

డిగ్రీ ప్రవేశాల దరఖాస్తుకు గడువు పొడిగింపు

కర్నూలు (న్యూసిటీ): నాలుగేళ్ల హానర్స్ డిగ్రీ కోర్సుల్లో మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు గడువు ఈ నెల 12వ తేదీ వరకు పొడిగించినట్లు డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ రిజిస్ట్రార్ బాయినేని శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ ఎకనామిక్స్, బి.కామ్ కంప్యూటర్ అప్లికేషన్స్, బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీబీఏ బిజినెస్ అనలిటిక్స్ హానర్స్ కోర్సుల్లో విద్యార్థులు చేరవచ్చని పేర్కొన్నారు. 15 నుంచి 19వ తేదీలోగా విద్యార్థులు వెబ్ ఆప్షన్స్‌లో డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీని ఎంపిక చేసుకోవాలని తెలిపారు. 24వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుందని, ఆరోజు విద్యార్థులు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు.

పెట్టుబడి సాయానికి కౌలు రైతులు అర్హులే!

కర్నూలు(అగ్రికల్చర్): 2023-24 సంవత్సరానికి సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలు రైతులు వైఎస్ఆర్ రైతుభరోసా కింద పెట్టుబడి సాయం పొందడానికి అర్హులు. కార్డులు పొందిన కౌలుదారులు వెంటనే సంబంధిత రైతుభరోసా కేంద్రాల ఇన్‌చార్జీలను సంప్రదించి అప్‌లోడ్ చేయించుకోవాలని వ్యవసాయ అధికార వర్గాలు తెలిపాయి. సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలుదారులకు ప్రభుత్వమే పెట్టుబడిసాయం పూర్తిగా రూ.13,500 చెల్లించనుంది. సొంత భూమి లేని కౌలుదారులు మాత్రమే ఇందుకు అర్హులని అధికారులు తెలిపారు. 2023-24 సంవత్సరానికి సంబంధించి రెండో విడత పెట్టుబడి సాయం అక్టోబర్‌లో రైతుల బ్యాంకు ఖాతాలకు విడుదల కానుంది. ఇదిలాఉంటే జిల్లాలో సీసీఆర్సీ కార్డుల జారీ ముమ్మరంగా సాగుతోంది. జిల్లా వ్యాప్తంగా 472 గ్రామాల్లో 9,448 సీసీఆర్సీ కార్డులు జారీ అయ్యాయి.

ఆర్టీసీ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు



మాట్లాడుతున్న చల్లా చంద్రయ్య

కర్నూలు(రాజ్‌విహార్): ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఉద్యోగుల జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని వైఎస్ఆర్ పీటీడీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చంద్రయ్య అన్నారు. గురువారం వైఎస్ఆర్‌సీపీ జిల్లా కార్యాలయంలో కర్నూలు, నంద్యాల జిల్లాల ముఖ్య నాయకుల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా చల్లా చంద్రయ్య మాట్లాడుతూ.. ఆర్టీసీ రూ.6,700 కోట్ల అప్పులు భర్తీ చేయడంతో పాటు రూ.12 వేల కోట్లు జీతభత్యాల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చారన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్‌పీ రావు ,రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీఎస్ఎస్ రెడ్డి, కార్యదర్శి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమానికి శాశ్వత జలధార!

- రూ.832 కోట్లతో ప్రతిపాదనలు పంపిన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు
- నిధులు మంజూరైతే 405 పల్లెలకు తొలగనున్న తాగునీటి ఇబ్బందులు
- ఐదు నియోజకవర్గాల్లోని 19 మండలాలకు ప్రయోజనం
- మూడు రిజర్వాయర్ల నుంచి 1.023 టీఎంసీల నీటి వినియోగానికి చర్యలు
- 2054 సంవత్సరం జనాభాకు అనుగుణంగా ప్రణాళికలు



మండు వేసవిలో సైతం జిల్లా పశ్చిమ ప్రాంత వాసుల గొంతు తడారకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. శాశ్వత మంచినీటి పథకాలను ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు కోరింది. పెరిగే జనాభాకు అనుగుణంగా మంచినీటి వనరులను గుర్తిస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రూ.832 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. నిధులు మంజూరైన వెంటనే టెండర్లు పిలిచి పనులు చేపట్టనున్నారు.



పులికనుమ రిజర్వాయర్ (ఫైల్)

జిల్లాలో నీటి పథకాల వివరాలు..

జిల్లా గ్రామ పంచాయతీలు	: 484
మొత్తం గ్రామాలు	: 721
గ్రామీణ జనాభా	: 16,28,736
రోజుకు ఒక వ్యక్తికి అందిస్తున్న రక్షిత మంచినీరు	: 55 లీటర్లు
సీపీడబ్ల్యూఎస్‌లు (సమగ్ర రక్షిత మంచినీటి పథకాలు)	: 32
పీడబ్ల్యూఎస్‌లు (రక్షిత మంచినీటి పథకాలు)	: 371
ఎంపీడబ్ల్యూఎస్‌లు (చిన్న మంచినీటి పథకాలు)	: 445
డైరెక్ట్ పంపింగ్	: 97

కర్నూలు(అర్బన్): జిల్లా పశ్చిమ ప్రాంతాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (ఆడా) అనే సంస్థను ఏర్పాటు చేశారు. దీని పరిధిలో ఒక వైపు అభివృద్ధి పనులకు బీజం వేస్తూనే.. మరో వైపు వేసవిలో ప్రజల తాగునీటికి ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం ఇంజినీర్లు ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 19 మండలాల్లోని గ్రామాల ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు (2054 సంవత్సర జనాభాను దృష్టిలో ఉంచుకొని) ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేశారు. రూ.832 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

2054 జానాభాకు అనుగుణంగా...

జిల్లా పశ్చిమ ప్రాంతానికి సంబంధించి ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆలూరు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని 19 మండలాల్లోని 405 పల్లెలకు పూర్తి స్థాయిలో తాగునీటి ఇబ్బందులు తొలగించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం పశ్చిమ ప్రాంతానికి సంబంధించిన 19 మండలాల్లో దాదాపు 12 లక్షల జనాభా ఉంది. భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని 2054 సంవత్సరానికి 13,20,913 మంది జనాభాకు అనుగుణంగా తాగునీరు అందించేందుకు డిజైన్ల రూపకల్పన చేశారు.

మూడు రిజర్వాయర్ల నుంచి నీరు

తాగునీటి ఎద్దడిని ఎదుర్కొంటున్న 405 పల్లెలకు శాశ్వతంగా నీటి అవసరాలు తీర్చేందుకు ఆయా ప్రాంతాల్లోని మూడు రిజర్వాయర్ల నుంచి 1.023 టీఎంసీల నీరు వినియోగించుకోనున్నారు. ఈ మేరకు నీటి పారుదల శాఖ అధికారులతో కూడా చర్చించి, ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. పులికనుమ రిజర్వాయర్ నుంచి 111 పల్లెలకు రూ.207 కోట్ల అంచనాతో 0.336 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు ప్రణాళికలు రూపొందించారు. అలాగే గాజులదిన్నె రిజర్వాయర్ నుంచి 71 గ్రామాలకు రూ.135 కోట్ల అంచనాతో 0.238 టీఎంసీలు, పందికోన రిజర్వాయర్ నుంచి 223 పల్లెల తాగునీటి అవసరాలు తీర్చేందుకు రూ.490 కోట్లతో ప్రణాళికలు రూపొందించారు. రూ. 832 కోట్ల వ్యయంతో రిజర్వాయర్ల నుంచి ప్రత్యేకంగా పైప్‌లైన్లు వేసి ఆయా గ్రామీణ ప్రాంతాలకు నీటిని అందించనున్నారు.

శాశ్వత పరిష్కారం



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా పశ్చిమ ప్రాంతంలో శాశ్వతంగా తాగునీటి ఎద్దడిని నివారించేందుకు అవసరమైన ప్రతిపాదనలను రూపొందించి పంపించాం. ఈ ప్రతిపాదనల మేరకు పనులు చేపడితే దాదాపు 19 మండలాల్లో ఇక తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశాలే ఉండవు. 3 రిజర్వాయర్ల నుంచి నీటిని వినియోగించుకుంటే 405 పల్లెల్లో నీటి సమస్య తీరుతుంది. ఈ వేసవిలో కూడా ఆదోని, పత్తికొండ డివిజన్లలోని పలు గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశాం.

– బీ నాగేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ

19న విద్యుత్ సీఎండీ కర్నూలు రాక

కర్నూలు(రాజ్‌విహార్): దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు ఈనెల 19వ తేదీన కర్నూలుకు రానున్నారు. కర్నూలు, నంద్యాల విద్యుత్ డివిజన్ల సమీక్ష సమావేశంలో పాల్గొనేందుకు ఆయన వస్తున్నారు. ఆపరేషన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లతో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, టెక్నికల్, కమర్షియల్, ట్రాన్స్‌ఫార్మర్స్, ఎం అండ్‌పీ, కన్‌స్ట్రక్షన్స్ విభాగాలు, అకౌంట్స్ ఆఫీసర్లతో సమావేశం కానున్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

కర్నూలు(అగ్రికల్చర్): జూలై నెలకు సంబంధించి వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ ముగిసింది. కర్నూలు జిల్లాలో 2,36,773 పింఛన్లు ఉండగా.. 2,34,991 మందికి రూ.65.33 కోట్లు పంపిణీ చేశారు. పంపిణీ 99.25 శాతం పూర్తి కాగా.. జిల్లా రాష్ట్రంలో 5వ స్థానంలో నిలిచింది. జిల్లా స్థాయిలో గూడూరు మండలం, అర్బన్ ప్రాంతాల్లో ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పంపిణీలో మొదటి స్థానం దక్కించుకున్నట్లు డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ మల్లికార్జునుడు తెలిపారు.

- నంద్యాల జిల్లాలో 2,14,261 పింఛన్లు ఉండగా.. 2,12,670 మందికి రూ.58.69 కోట్లు పంపిణీ చేశారు. పంపిణీ 99.26 శాతం పూర్తి కాగా.. జిల్లా రాష్ట్రంలో 4వ స్థానంలో నిలిచింది.

డాక్టర్ ప్రభాకర్‌రెడ్డికి నాటా అవార్డు



కర్నూలు(హాస్పిటల్): వైద్యరంగంలో చేసిన కృషికి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల డిప్యూటీ సూపరింటెండెంట్, కార్డియోథొరాసిక్ సర్జరీ హెచ్‌వోడి డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి నాటా ఎక్స్‌లెన్స్ అవార్డు దక్కించుకున్నారు. టెక్సాస్‌లోని డల్లాస్‌లో ఇటీవల ముగిసిన నాటా కన్వెన్షన్–2023లో సీటీ సర్జరీ విభాగంలో డాక్టర్ ప్రభాకర్‌రెడ్డిని ఈ అవార్డు వరించింది. కార్డియోథొరాసిక్ సర్జన్‌గా ఆయన చేసిన గుండె, ఊపిరితిత్తుల శస్త్రచికిత్సలు, అధునాతన పద్ధతిలో నిర్వహించిన గుండె ఆపరేషన్లు, కోవిడ్ సమయంలో అందించిన సూచనలు, సలహాలు తదితర విషయాలను పరిగణనలోకి తీసుకుని తనకు నాటా సభ్యులు ఈ అవార్డు ప్రకటించినట్లు డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.

బస్సుయాత్ర పేరుతో విహారం



మాట్లాడుతున్న రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

- కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం

ఆలూరు: బస్సు యాత్ర పేరుతో జిల్లాలో టీడీపీ నేతలు విహారయాత్ర చేస్తున్నారని కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం విమర్శించారు. టీడీపీ హయాంలో వితంతువులు, బాలింతలు, గర్భిణుల సొమ్మును తెలుదేశం పార్టీ నాయకులు కాజేశారని ఆరోపించారు. హామీలు అమలు చేయకుండా మోసం చేశారని, మళ్లీ ఏముఖం పెట్టుకుని ప్రజల్లోకి వస్తున్నారని ప్రశ్నించారు. మండలంలోని మనేకుర్తి, ఎ. గోనేహాళ్ గ్రామాల్లో గురువారం వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీరేష్ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గోనేహాళ్‌లో రూ.12 లక్షలతో నూతనంగా నిర్మించిన ఉద్యాన ఉత్పత్తుల కలెక్షన్ సెంటర్ మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా నేరుగా బ్యాంకు ఖాతాలకే నగదు జమ అవుతోందన్నారు. 2019 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పినా టీడీపీ నేతలకు జ్ఞానోదయం కలగలేదన్నారు. టీడీపీ హయాంలో ఆలూరు నియోజకవర్గానికి ఏమీ చేయలేదని, వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ. వెయ్యి కోట్లతో వివిధ పనులు చేశామన్నారు. జరిగిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కో ఆర్డినేటర్ నారాయణస్వామి, ఎంపీపీ రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు ఏరూరు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు నెలల్లో జీడీపీ పనులు పూర్తి

గోనెగండ్ల: గాజులదిన్నె ప్రాజెక్టు (జీడీపీ) ఆనకట్ట ఎత్తు పనులు మరో మూడు నెలల్లో పూర్తి చేయనున్నామని జిల్లా నీటి పారుదలశాఖ ఎస్ఈ రెడ్డి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన గాజులదిన్నె ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన రూ.53 కోట్ల నిధులతో ఆనకట్ట ఎత్తు పెంపు పనులు జరుగుతున్నాయన్నారు. జీడీపీ ఆరు క్రస్ట్‌గేట్లను మార్చుతున్నామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 4.5 టీఎంసీల నీటిని నిలువ చేసే సామర్థ్యం ఉందని, ఆనకట్ట ఎత్తు పెంచితే 5.5 టీఎంసీలు నిల్వ చేసుకోవచ్చన్నారు. జీడీపీలో నీటి నిల్వ పెరిగితే ఎగువ ప్రాంతంలో భూమి కావాల్సి ఉంటుందని, సర్వే చేసిన తరువాత ఎంత కావాలో నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ శైలేశ్వర్, ఏఈ మహమ్మద్ ఆలీ, ఉగ్రనరసింహ తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజూ అపూర్వ స్పందన

- 38 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, వైఎస్సార్‌సీపీ నేతలు
- 15,375 మందికి ధ్రువపత్రాల పంపిణీ

కర్నూలు(సెంట్రల్): జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆరో రోజు గురువారం జిల్లాలో 15,375 వేల మందికి వివిధ ధ్రువపత్రాలను అందజేశారు. అలాగే పలువురిని సంక్షేమపథకాల అర్హత జాబితాలో చేర్చారు. గురువారం జిల్లాలో 38 సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. కర్నూలు నగరంలోని 16, 100, 29 సచివాలయాల పరిధిలో సురక్ష క్యాంపులను ఏర్పాటు చేశారు. ఇందులో 100వ సచివాలయం పరిధిలో జరిగిన క్యాంపునకు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జే.సుధాకర్, 29వ వార్డు సచివాలయంలో పరిధిలో జరిగిన క్యాంపునకు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి, 16వ వార్డులో జరిగిన క్యాంపునకు కర్నూలు నగర పాలక సంస్థ కమిషనర్ భార్గవ్‌తేజ హాజరై అర్హులకు వివిధ ధ్రువపత్రాలను జారీ చేశారు. కోడుమూరు మండలం ప్యాలకుర్తి, సీబెగళగల్ మండలం ముడుమాల, రంగాపురం సచివాలయాల పరిధిలో జరిగిన సురక్ష క్యాంపులకు కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జే.సుధాకర్ హాజరయ్యారు. ఎమ్మిగనూరులోని 8, 9, 10 సచివాలయ పరిధిలో నిర్వహించిన సురక్ష క్యాంపులకు ముఖ్య అతిథిగా నియోజకవర్గ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్‌రెడ్డి హాజరై సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి.. కోసిగి మండలం కేంద్రంతోపాటు జంపాపురంలలో జరిగిన సురక్ష క్యాంపుల్లో పాల్గొన్నారు. కృష్ణగిరి మండలం చెరుకల చెర్వులో పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, ఓర్వకల్లు మండలం నన్నూరులో జరిగిన జగనన్న సురక్ష క్యాంపునకు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరై లబ్ధిదారులకు ధ్రువపత్రాలను అందజేశారు.

పకడ్బందీగా జగనన్న సురక్ష క్యాంపులు

జగనన్న సురక్ష క్యాంపులను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అధికారులను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి ఆదేశించారు. గురువారం ఆయన విజయవాడ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. క్యాంపుల నిర్వహణ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత భవనాలను త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రీసర్వేను నిర్దేశించిన సమయంలో పూర్తి చేయాలన్నారు. పీఎం కిసాన్‌కు సంబంధించి ఈకేవైసీని ఈనెల 31వ తేదీలోపు పూర్తి చేయించాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ డాక్టర్ జి.సృజన హాజరయ్యారు.



సి.బెళగల్ మండలం కొండాపురం గ్రామంలో మాట్లాడుతున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

సి.బెళగల్: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష క్యాంపులను నిర్వహిస్తోందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ అన్నారు. గురువారం సి.బెళగల్ మండల పరిధిలోని ముడుమాల గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గ్రామ ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గత ప్రభుత్వానికి, ఇప్పటి మన ప్రభుత్వానికి మధ్య తేడాను గుర్తించాలన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి మద్దతుగా నిలవాలని కోరారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ముడుమాల గ్రామంలో 201 మంది లబ్ధిదారులకు, కొండాపురంలో 298 మంది లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలను అధికారులు అందించారు.



ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను అందిస్తున్న దృశ్యం

ఒక్కరోజులో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్

సి.బెళగల్ మండలం ముడుమాల గ్రామానికి చెందిన కురువ హనుమంతు, మద్దిలేటి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కావాలని గ్రామ వలంటీర్‌ను అడిగారు. గురువారం జగనన్న సురక్ష కార్యక్రమం ఉండటంతో తహసీల్దార్ శేషఫణి, వీఆర్వో అక్బర్‌హుసేన్‌లు వెంటనే స్పందించి ఒక్క రోజులోనే లబ్ధిదారులకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌ను జారీ చేసి అందజేశారు.

అటవీ భూముల ఆక్రమణకు అడ్డుకట్ట

- ఆక్రమిత భూమి స్వాధీనానికి చర్యలు
- నోటీసులు అందిస్తున్న అటవీశాఖ అధికారులు
- జిల్లాలో 495.122 హెక్టార్ల అటవీ భూమి ఆక్రమణ



పెండేకల్లులో నోటీసు అందజేస్తున్న కర్నూలు రేంజర్ సూర్యచంద్ర రాజు

కర్నూలు కల్చరల్: అటవీ శాఖ ఆధ్వర్యంలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ సంరక్షణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వివిధ ఆర్ఎఫ్ కంపార్ట్‌మెంట్‌లలో ఆక్రమణలకు గురైన అటవీ భూముల స్వాధీనానికి అటవీ శాఖ అధికారులు రంగం సిద్ధం చేశారు. గతంలో అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో చాలా ప్రాంతాల్లో రిజర్వ్ ఫారెస్ట్ ఆక్రమణలకు గురైంది. కొన్ని చోట్ల ఆక్రమించుకొన్న భూముల్లో పంటలు వేసుకొని అనుభవిస్తున్నా పట్టించుకోలేదు. అయితే రాష్ట్ర హైకోర్టు ఆక్రమణలకు గురైన అటవీ శాఖ స్థలాలను స్వాధీనం చేసుకునేందుకు నోటీస్‌లు జారీ చేయించాలని జిల్లా కలెక్టర్‌లను ఆదేశించింది. అందులో భాగంగా ఆక్రమిత దారులను గుర్తించి నోటీస్‌లు ఇస్తున్నారు. జిల్లాలో అటవీ విస్తీర్ణం 34.808 హెక్టార్లు ఉండగా ఇందులో సుమారు 495 హెక్టార్లు అక్రమణలకు గురైనట్లు అధికారులు గుర్తించారు. ఈ భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు చర్యలు చేపట్టారు.

కర్నూలు రేంజ్‌లో..

- వడ్డేమాను రిజర్వ్ ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్ 85లో భూమిని, యాపర్లపాడు ఆర్ఎఫ్ కంపార్ట్‌మెంట్‌లు 65, 69, 70, రామళ్ల కోట వెస్ట్ ఆర్ఎఫ్ కంపార్ట్‌మెంట్‌లు 71, 73లలో భూమిని ఆక్రమించారు. కటారుకొండ ఆర్ఎఫ్ కంపార్ట్‌మెంట్‌లు 181,182, 183, రామళ్ల కోట ఈస్ట్ ఆర్ఎఫ్ కంపార్ట్‌మెంట్‌లు 75,76, ఎంబాయ్ ఆర్ఎఫ్ కంపార్ట్‌మెంట్ 78లో భూమిని ఆక్రమించుకున్నారు. గని ఆర్ఎఫ్ కంపార్ట్‌మెంట్లు 117,118, 120, 121, ఎల్.బండ ఆర్ఎఫ్ కంపార్ట్‌మెంట్లు 174, 175, 179, 180లలో భూమి ఆక్రమణకు గురైంది. మొత్తం 314. 083 హెక్టార్లు ఆక్రమించుకున్నట్లు గుర్తించారు.

ఆదోని రేంజ్‌లో..

- గూళ్యం రిజర్వ్ ఫారెస్ట్ కంపార్ట్‌మెంట్లు 1,2,3,4,5లో 168.66 హెక్టార్లు, పత్తికొండ ఆర్ఎఫ్ కంపార్ట్‌మెంట్‌లు 52, 53,54లో 12.63 హెక్టార్లు.. మొత్తం 181.39 హెక్టార్లు ఆక్రమించుకున్నట్లు గుర్తించారు.

జిల్లాలో అటవీశాఖ వివరాలు ఇలా..

రేంజ్: కర్నూలు

సెక్షన్లు: 2 | బీట్లు: 6

అటవీ విస్తీర్ణం: 14,956.99 హెక్టార్లు

మండలాలు: వెల్దుర్తి, సి.బెళగల్, కర్నూలు గూడూరు, కోడుమూరు, కల్లూరు, ఓర్వకల్లు, కృష్ణగిరి.

రేంజ్: ఆదోని

సెక్షన్లు: 3 | బీట్లు: 11

అటవీ విస్తీర్ణం: 19,851.95 హెక్టార్లు

మండలాలు: కోసిగి, కౌతాళం, మంత్రాలయం, నందవరం, పెద్దకడుబూరు, ఎమ్మిగనూరు, గోనెగండ్ల, ఆదోని, హొళగుంద, ఆస్పరి, ఆలూరు, దేవనకొండ, పత్తికొండ, హాలహర్వి, తుగ్గలి, మద్దికెర ఈస్ట్, చిప్పగిరి.



ఆర్ఎఫ్ సరిహద్దు రాయిని పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు

అటవీ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు. ఆక్రమిత దారులను గుర్తించి అటవీ శాఖ చట్టాలను అనుసరించి కేసులు నమోదు చేయిస్తాం. ఇప్పటికే జిల్లాలో రిజర్వ్ ఫారెస్ట్‌ను ఆక్రమించుకున్నవారికి కర్నూలు, ఆదోని రేంజ్ అధికారులు నోటీస్‌లు జారీ చేశారు. త్వరలోనే అక్రమించుకున్న అటవీ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకుంటాం.

– పల్లె శివశంకర్‌రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి

జంతువుల నుంచి సోకే వ్యాధులపై అవగాహన అవసరం


పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న జేడీ రామచంద్రయ్య

కర్నూలు(అగ్రికల్చర్): జంతువుల నుంచి మనుషులకు సోకే వ్యాధుల పట్ల అవగాహన పెంచుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ రామచంద్రయ్య తెలిపారు. గురువారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలులోని బహుళార్ధ పశువైద్యశాల, అన్ని ఏరియా పశువైద్యశాలల్లో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకాలు వేశారు. ఈ సందర్భంగా పెంపుడు కుక్కల యజమానులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ రామయంద్రయ్య మాట్లాడుతూ రేబిస్ టీకాలను ప్రతిరోజూ వేస్తారని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వీధి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గొర్రెలు, మేకలు, ఇతర పశువుల నుంచి సంక్రమించే వ్యాధులు, నివారణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో బహుళార్ధ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ హేమంత్‌కుమార్, జిల్లా డివిజన్ డీడీ డాక్టర్ దుర్గాప్రసన్నబాబు, ఆదోని డివిజన్ డీడీ రమణ, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ రవిబాబు తదితరులు పాల్గొన్నారు.

పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు(హాస్పిటల్): డిప్లొమా ఇన్ పారామెడికల్ కోర్సులకు ఇంటర్‌మీడియట్ బైపీసీ అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి ఈ నెల 24వ తేదిలోగా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల కార్యాలయంలో రూ.100 రుసుము చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను పూర్తిగా పూరించకపోతే ఎలాంటి సమాచారం లేకుండానే తిరస్కరిస్తామన్నారు. పోస్టు ద్వారా వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు. దరఖాస్తులను www.appmb.com.in/ apsahpc. co. in వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పారా మెడికల్ కోర్సుల కౌన్సెలింగ్ ఆగస్టు ఒకటో తేదీన నిర్వహిస్తామన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలతో విద్యావ్యవస్థ నాశనం

- మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి


మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి

మంత్రాలయం రూరల్: కేంద్ర ప్రభుత్వ విధానాలతో దేశంలో విద్యావ్యవస్థ పూర్తిగా నాశనం అవుతోందని మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఆరోపించారు. మంత్రాలయం హెచ్చార్పీ కల్యాణ మండపంలో ఏఐఎస్ఎఫ్ మూడు రోజుల శిక్షణ తరగతులు గురువారంతో ముగిశాయి. చివరి రోజు మాజీ ఎమ్మెల్సీతో పాటు ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్‌బాబు, కేశిరెడ్డి మాట్లాడారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం జాతీయ నూతన విద్యా విధానం తీసుకొచ్చి ప్రస్తుతం ఉన్న విద్యావ్యవస్థను అతలాకుతలం చేసిందన్నారు. మూడు సంవత్సరాల డిగ్రీనీ నాలుగు సంవత్సరాలకు పెంచడాన్ని ఖండించారు. దీన్ని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, కర్నూలు, అనంతపురం, సత్యసాయి, నంద్యాల జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు సోమన్న, శ్రీరాములు, కుళ్లాయి స్వామి, శ్రీనివాసులు, ధనుంజయ్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజేంద్ర ప్రసాద్, జిల్లా నాయకులు థామస్, షాబీర్, విజయేంద్ర, రంగస్వామి, శరత్ తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు నగరపాలక సంస్థ

పత్రికా ప్రకటన

కర్నూలు నగరపాలక సంస్థ నందు గల వివిధ వార్డుల యందు జరుగుచున్న అభివృద్ధి పనుల యొక్క సమాచారమును ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా వారికి మరియు సోషల్ మీడియా మాధ్యమముల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు చేరవేయుటకు గాను ఒక పబ్లిక్ రిలేషన్ ఆఫీసరు (పి.ఆర్.ఓ) మరియు ఒక ఫోటోగ్రాఫర్‌ను కాంట్రాక్టు పద్ధతిపై ఒక సంవత్సర కాలము పాటు నియమించుటకు గాను ఈ క్రింద తెల్పిన విద్యార్హతలు గల వ్యక్తులను తగు ప్రభుత్వ ఆమోదము పొందిన ఏజెన్సీలు/ యస్.ఎల్.ఎఫ్ (SLF) ల ద్వార తేది: 07.07.2023 నుండి 13.07.2023 లోగా కర్నూలు నగరపాలక సంస్థ కార్యాలయము నందు తమ యొక్క సర్వీసు చార్జస్/ కమీషను తెలియజేస్తూ దరఖాస్తులను సమర్పించవలసినదిగా కోరడమైనది. దరఖాస్తు సమర్పించు ఏజెన్సీలు/ యస్.ఎల్.ఎఫ్ (SLF) లకు జి.యస్.టి. లైసెన్స్ కలిగి ఉండవలెను.

1) పబ్లిక్ రిలేషన్ ఆఫీసరు :
విద్యార్హతలు : (1) ఏదైనా డిగ్రీ మరియు డిప్లొమా ఇన్ జర్నలిజం
(2) ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మీడియా (తెలుగు & ఇంగ్లీష్) నందు 5 సంవత్సరములు పైబడి అనుభవం కలిగి ఉండాలి.
(3) కంప్యూటర్ పరిజ్ఞానము (MS-Office, Photoshop and Other Software's) కలిగి ఉండాలి.
(4) 25 నుండి 35 సంవత్సరముల మధ్య వయస్సు కలిగి ఉండాలి.
2) ఫోటోగ్రాఫర్ :
విద్యార్హతలు : (1) ఇంటర్ మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలి.
(2) ఫోటోగ్రాఫర్ వృత్తి యందు 5 సంవత్సరములు పైబడి అనుభవం కలిగి ఉండాలి.
(3) 25 నుండి 35 సంవత్సరముల మధ్య వయస్సు కలిగి ఉండాలి.


పూర్తి వివరాల కొరకు ఆఫీసు పనివేళల యందు మేనేజరు, కర్నూలు నగరపాలక సంస్థ వారిని సంప్రదించవచ్చును.


సం/- ఎ.భార్గవతేజ, కమీషనరు, కర్నూలు నగరపాలక సంస్థ, కర్నూలు


రెండు డ్రైవర్, ఒక డాక్టర్ పోస్టు ఖాళీ

కర్నూలు(అగ్రికల్చర్): వైఎస్ఆర్ సంచార పశు వైద్య రథాలకు సంబంధించి రెండు డ్రైవర్ పోస్టులు, ఒక డాక్టర్ పోస్టు ఖాళీగా ఉందని ఈఎంఆర్ఐ–జీహెచ్ఎస్ జిల్లా మేనేజర్ రామకృష్ణగౌడు తెలిపారు. క్రిష్ణగిరి లొకేషన్‌లోని వెటర్నరీ అంబులేటరీ సర్వీస్‌కు సంబంధించి రెగ్యులర్ డ్రైవర్ పోస్టు, కర్నూలు లొకేషన్‌కు సంబంధించి రిలీవర్ డ్రైవర్ పోస్టు ఖాళీగా ఉందన్నారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులని తెలిపారు. నెలకు రూ.10,800 వేతనంతో పాటు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు ఉంటాయన్నారు. ఆదోని మండలం మదిర–3 లొకేషన్‌కు సంబంధించి డాక్టర్ పోస్టు ఖాళీగా ఉందని, బీవీఎస్సీ పూర్తి చేసిన వారితో పాటు విశ్రాంత పశువైద్యులు అర్హులన్నారు. నెలకు రూ.40 వేల వేతనం లభిస్తుందన్నారు.


నంది విగ్రహం నోట్లో నుంచి జాలువారుతున్న నీటి ధార


ఆలయ సమీపంలోని పుష్కరణి వద్ద మునులు తపస్సు ఆచరించిన ప్రాంతం


పుష్కరిణిలో చిన్నారుల కేరింత



యాగంటి క్షేత్ర విహంగ వీక్షణం..కనువిందు చేసే ఒంపులు తిరిగిన రోడ్డు

ప్రకృతి చెక్కిన పరమాద్భుతం


యాగంటి బసవేశ్వరుడు

మురిపించే ఎర్రరాళ్ల సోయగం.. శిల్పి ఉలితో శ్రద్ధగా చెక్కినట్లు కొండల సౌందర్యం.. ఊహా ప్రపంచాన్ని తలదన్నేలా అద్భుత నిర్మాణం.. యాగంటి ఉమామహేశ్వరాలయం ప్రకృతి చెక్కిన పరమాద్భుతం.. పురాతనను అద్దుకున్న విశిష్ట క్షేత్రం..శివ,కేశవులు ఇద్దరూ కొలువై ఉన్న పరమ పవిత్ర ప్రాంతం. లేచి రంకె వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు, జీవకళ ఉట్టిపడుతూ రోజురోజుకూ పెరుగుతున్న బసవేశ్వరుడిని ఇక్కడ చూసి తీరాల్సిందే. కొండకోనల్లో నుంచి వచ్చే జలధార ఏడాదిపొడువునా నంది విగ్రహం నోటి నుంచి కోనేరులోకి దూకడం ఆశ్చర్యంగా కనిపిస్తుంది. కోనేటి నీటికి ఔషధ గుణాలు ఉన్నాయని, ఇక్కడ స్నానం చేస్తే ఆరోగ్యం సిద్ధిస్తుందని భక్తుల నమ్మకం. సహజ సిద్ధమైన గుహలు.. వాటి ప్రాశస్త్యం తెలుసుకోవాల్సిందే! ఇక్కడే అగస్త్య మహాముని, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తపస్సు చేశారని స్థలపురాణం చెబుతోంది. ఎత్తయిన కొండలు.. ఇటీవల కురిసిన వర్షాలకు పరుచుకున్న పచ్చదనం.. శివుని మెడలో పాములా కనిపించే తారు రోడ్డు.. ఆకాశాన్ని అందుకుంటుందా అన్నట్లు ఉండే గాలి గోపురం.. ఇలా ఎన్నో విశేషాల యాగంటి దర్శనం ఆహ్లాదాన్ని, ఆధ్యాత్మిక అనుభూతిని పంచుతోంది.

– ఫొటోలు: డి.హుస్సేన్


వీరబ్రహ్మేంద్రస్వామి తపస్సు చేసిన ప్రాంతం


గాలిగోపురం అందాలను తిలకిస్తున్న భక్తులు


వేంకటేశ్వరస్వామి కొలువై ఉన్న గుహ


గుడి వెనుక ఎత్తయిన కొండమీద గరుడ దీపం

గంజాయిపై పోలీసుల స్పెషల్ డ్రైవ్

- వారం రోజుల్లో 43 కేజీల గంజాయి స్వాధీనం
- 36 మంది అరెస్ట్, మరికొందరు పరారీ


గంజాయి విక్రేతల అరెస్ట్ చూపుతూ వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బొమ్మలసత్రం: గంజాయి విక్రయాలపై జిల్లా పోలీసులు కొరఢా ఝలిపించారు. జిల్లాలో గంజాయి తరలింపు..విక్రయాలను అరికట్టేందుకు ఎస్‌బీ, సెబ్, సివిల్ పోలీసులు నిఘా వేసి 43 కేజీల గంజాయితో పాటు 36 మంది నిందితులను గురువారం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ తూర్పు ఏజెన్సీ ప్రాంతాల నుంచి వివిధ మార్గాల ద్వారా జిల్లాకు గంజాయి తరలింపు జరుగుతున్న నేపథ్యంతో పోలీసులను అప్రమత్తం చేశామన్నారు. గత వారం రోజుల్లోనే నంద్యాల సబ్ డివిజన్ పరిధిలో 15 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 11.45 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే ఆత్మకూరు సబ్‌డివిజన్ పరిధిలో 22 మంది నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి 28.40 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఆళ్లగడ్డ సబ్‌డివిజన్ పరిధిలో ఇద్దరి నుంచి 1.20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. డోన్ సబ్‌డివిజన్ పరిధిలో ఇద్దరిని అరెస్ట్ చేసి వారి నుంచి 2 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అరెస్ట్ చేసిన నిందితుల్లో 15 మంది గంజాయి విక్రయించే వ్యాపారులు ఉండగా గంజాయిని తూర్పు ఏజెన్సీ నుంచి సరఫరా చేసిన వారు ముగ్గురు ఉన్నారన్నారు. గంజాయి వినియోగించే 18 మందిని కేసులో నిందితులుగా చేర్చామన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ వెంకటరాముడు, డీఎస్పీ మహేశ్వరరెడ్డి, రూరల్ సీఐ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుల అరెస్ట్..

నంద్యాల పట్టణం పీవీ నగర్‌కు చెందిన వెంకటలక్ష్మమ్మ, వెంకటరమణ, వెంకటకుమార్, ఖాజావలి, యుగంధర్, బాలనాగన్న, నాగస్వామి నాయక్ అనే 7 మంది నిందితులు 6.50 కేజీల గంజాయిని బుధవారం తరలిస్తుండగా తాలుకా పోలీసులు పట్టుకున్నారు. గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.

మట్కా కేసులో 76 మంది అరెస్ట్..

జిల్లాలో మట్కా నిర్వాహకులపై ఎస్పీ ఆదేశాల మేరకూ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. వారం రోజుల్లో మట్కా నిర్వాహకులపై 33 కేసులు నమోదు చేసి 76 మంది నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఇందులో 69 మంది మట్కా బీటర్లు ఉండగా 7 మంది నిర్వాహకులు ఉన్నట్లు ఎస్పీ తెలిపారు.

దంపతుల ఆత్మహత్య

- ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం
- అనాథలైన ముగ్గురు చిన్నారులు
- శ్రీరంగాపురంలో విషాదం



మృతి చెందిన గౌరిగాళ్ల వెంకటేశ్వర్లు, శిరీష

రుద్రవరం: కుటుంబ ఆర్థిక ఇబ్బందులతో దంపతులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన రుద్రవరం మండలంలోని శ్రీరంగాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. బండిఆత్మకూరు మండలం పరమటూరు గ్రామానికి చెందిన శిరీష(26)ను శ్రీరంగాపురం గ్రామానికి చెందిన గౌరిగాళ్ల వెంకటేశ్వర్లు (32)తో ఎనిమిదేళ్ల క్రితం పెద్దలు పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె సతానం. కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. కొంత కాలంగా శిరీష కడుపు నొప్పితో బాధ పడుతూ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకుంది. కుటుంబ పోషణ, ఆసుపత్రుల ఖర్చుల నిమిత్తం భర్త వెంకటేశ్వర్లు దాదాపు రూ.3లక్షల వరకు అప్పు చేశాడు. ఆస్తులు లేకపోవడం అప్పులు పెరుగుతుండటంతో భార్యాభర్తల మధ్య వాగ్వాదం నెలకొంది. ఈ క్రమంలో బుధవారం రాత్రి వారి మధ్య గొడవ జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన శిరీష ఇంట్లో ఎవరూ లేని సమయంలో రసాయన ద్రావణాన్ని తాగింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను బంధువులు చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె భర్త కూడా జీవితంపై విరక్తి చెంది గురువారం ఉదయం ఇంట్లోనే ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతురాలి తల్లి నాగలక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు మృత దేహాలకు పోస్టుమార్టం నిర్వహించినట్లు ఏఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపారు.



అనాథలైన ముగ్గురు చిన్నారులు

అమ్మానాన్నా.. మాకెవ్వరు దిక్కు..

తల్లిదండ్రుల ఆత్మహత్యతో వారి పిల్లలు అనాథగా మిగిలారు. పోస్టుమార్టం అనంతరం ఇద్దరి మృతదేహాలను అంత్యక్రియల నిమిత్తం గ్రామానికి ట్రాక్టర్‌లో తీసుకొచ్చారు. శిరీష, వెంకటేశ్వర్లు మృతదేహాల వద్ద కుమారులు నరసింహ, ధనుష్, కుమార్తె ఇందుమతి రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. కుటుంబీకులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పిల్లల భవిష్యత్ గురించి ఆలోచించకుండా దంపతులు ఆత్మహత్యకు పాల్పడటంతో వారి ఆలనా పాలనా ఎవరు చూడాలంటూ చర్చించుకున్నారు.

క్లుప్తంగా

డీసీఎంఎస్ బ్రాంచ్‌ల ద్వారా ఎరువుల పంపిణీ


డీసీఎంఎస్ చైర్‌పర్సన్ శిరోమణి

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ సేవలను మరింత విస్తరించాలని చైర్ పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య తెలిపారు. గురువారం ఆమె కొండారెడ్డిబురుజు సమీపంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో బ్రాంచ్ మేనేజర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 18 బ్రాంచ్‌లలో ఈ ఖరీఫ్ నుంచి రైతులకు ఎరువుల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. 4–5 రోజుల్లో ఎరువులు సరఫరా చేస్తామన్నారు. మారుమూల గ్రామాల రైతులకు కూడా సేవలు అందించేందుకు త్వరలో కొత్త బ్రాంచీలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. సమావేశంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

రుద్రవరం: హరినగరం సమీపంలో విద్యుదాఘాతానికి గురై రాజేష్ (22)అనే యువకుడు మృతి చెందాడు. తెలుగుగంగ 24వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ మరమ్మతులను కాంట్రాక్టర్ పూర్తి చేయగా కొలతలు వేసేందుకు అధికారులు గురువారం వెళ్లారు. వారి వెంట శిరివెళ్ల మండలం గోవిందపల్లెకు చెందిన గడ్డం రాజేష్ అల్యూమిలియం కొలత బద్దను మోసుకెళ్తున్నాడు. ఓ చోట బురద ఉండటంతో ఎత్తుగా ఉన్న కొలత బద్దను అలాగే చేత పట్టుకొని కాల్వ కట్టపైకి చేరుకోగానే ప్రమాదవశాత్తుపై భాగాన ఉన్న విద్యుత్ తీగలు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు ఏఎస్‌ఐ భూపాల్‌రెడ్డి తెలిపారు.

ఉద్యోగ సాధనే లక్ష్యంగా చదవాలి

- అనుకున్నది సాధించే వరకు విశ్రమించరాదు
- అమిగోస్ 21 సెంచురీ ఐఏఎస్ సెంటర్ ఫ్యాకల్టీ ఆకెళ్ల రాఘవేంద్ర


మాట్లాడుతున్న ఆకెళ్ల రాఘవేంద్ర

కర్నూలు(సెంట్రల్): ఉద్యోగ సాధనే లక్ష్యంగా యువత చదువును కొనసాగించాలని హైదరాబాద్‌కు చెందిన అమిగోస్ 21వ సెంచురీ ఐఏఎస్ అకాడమీ సీనియర్ ఫ్యాకల్టీ ఆకెళ్ల రాఘవేంద్ర సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జిల్లా గ్రంథాలయసంస్థ ఆధ్వర్యంలో విద్యార్థి, యువత–లక్ష్యాల సాధన అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సెమినార్‌కు ఆయనతోపాటు జిల్లాకు చెందిన విద్యావేత్తలు ఆదిమూలపు సతీష్, కేవీ సుబ్బారెడ్డి, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆకెళ్ల రాఘవేంద్ర మాట్లాడుతూ.. అనుకున్న లక్ష్యం నెరవేరే వరకు విశ్రమించరాదన్నారు. ఉద్యోగం కోసం ఏడాది కష్టపడి చదివితే ఆ తరువాత సుఖంగా జీవించవచ్చన్నారు. రానున్న రెండు, మూడు నెలల్లో గ్రూపు–1, 2, 4తోపాటు డీఎస్సీ, ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌లు వచ్చే అవకాశం ఉందన్నారు.

ప్రతి నియోజకవర్గంలో సెమినార్లు

విద్యార్థి, యువత– లక్ష్యాల సాధన సెమినార్లను ప్రతి నియోజకవర్గంలో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.సుభాస్ చంద్రబోస్ తెలిపారు. పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారిలో ఉన్న అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తానని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఆశయాలను సాధించడం కోసం యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు సీహెచ్ మద్దయ్య, దేవపూజ ధనుంజయాచారి, బత్తుల లక్ష్మీకాంతయ్య , గాయకుడు మియ్యా పాల్గొన్నారు.


అవగాహన సదస్సుకు హాజరైన విద్యార్థులు